ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చిత్తూరు

జిల్లా వార్తలు

గురువారం 23 అక్టోబరు 2025





వెదురుకుప్పం మండలం తంగేలిమిట్ట సమీపంలోని మధ్యలవంకలో ఆటోను రోడ్డు దాటిస్తున్న యువకులు- కొట్టుకుపోతున్న బైక్‌రైడర్‌ను కాపాడుతున్న దృశ్యం



సోమల - నంజంపేట మార్గంలోని జీడిరేవుల వంక వద్ద కల్వర్టు కొట్టుకుపోవడంతో జనం కష్టాలు

రెడ్ అలర్ట్

మంగళవారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షం

- బుధవారం పగలంతా ముసురువాన
- వంద శాతం నిండిన 595 చెరువులు
- 26 వరకు వర్షాలు కొనసాగే అవకాశం



విజయపురం మండలం కృష్ణసముద్రంలో నీట మునిగిన వరిపంట

చిత్తూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. బుధవారం పగలంతా ముసురు వీడకపోవడంతో జనజీవనం స్తంభించిపోయింది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. చిత్తూరు జిల్లాతో పాటు పొరుగు జిల్లాలు తిరుపతి, అన్నమయ్యలకు కూడా వాతావరణ శాఖ అధికారులు బుధవారం రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో గురువారం కూడా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.26వ తేదీ వరకు వర్షాలు పడే అవకాశం ఉన్నందున కలెక్టరేట్‌లో 24 గంటలూ పనిచేసేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం అధికారులతో సమావేశం నిర్వహించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మూడు రోజుల పాటు అధికారులకు సెలవుల్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అధికార యంత్రాంగం జిల్లా కేంద్రాన్ని వదిలి వెళ్లకూడదని సూచించారు.

● నిండిన చెరువులు

జిల్లాలో మొత్తం 4122 చెరువులుండగా, 595 చెరువులు వంద శాతం నిండాయి. 493 చెరువులు 75శాతం, 1326 చెరువులు 50 శాతం, 1163 చెరువులు 25 శాతం, 545 చెరువులు 25 కంటే తక్కువ శాతం నిండాయి. పెనుమూరు మండలంలోని ఎన్టీఆర్, కార్వేటినగరంలోని కృష్ణాపురం జలాశయాలు నిండిపోయాయి. ఎన్టీఆర్ జలాశయంలోని 5 గేట్ల ద్వారా నీటిని కిందకు విడుదల చేశారు.

● చిత్తూరు నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కారణంగా డ్రైనేజీ సమస్యలు తలెత్తాయి. తేనెబండ వద్ద నీవా నది ఉధృతంగా ప్రవహించింది. చిత్తూరు - కాణిపాకం రోడ్డులో సంతపేట వద్ద కాలువలు బ్లాక్ అయిపోయి డ్రైనేజీ నీళ్లతో పాటు వర్షపు నీళ్లు కలిసి రోడ్డుపైకి వచ్చేయడంతో కమిషనర్ నరసింహ ప్రసాద్ అక్కడికి చేరుకుని సమస్యను పరిష్కరించారు.

● వెదురుకుప్పం - పెనుమూరు రహదారిలోని గుండుపల్లె, పాతగుంట వద్ద రోడ్డుపై వాగు ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోయాయి. వెదురుకుప్పం - దేవళంపేట రహదారిలోని తంగేలిమిట్ట సమీపంలో రోడ్డుపై వంక ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఓ బైక్‌రైడర్ మధ్యలవంకను దాటడానికి ప్రయత్నించి కొట్టుకుపోతుండగా స్థానికులు చొరవ చూపి కాపాడారు. అలాగే ఓ ఆటోను కూడా గట్టుకు చేర్చారు.

● సోమల, సదుం మండల్లాలోని గార్గేయ నది జోరుగా ప్రవహిస్తుండడంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలు స్తంభించిపోయాయి. సోమల మండలంలో పలు కల్వర్టులు కొట్టుకుపోయాయి. సోమల- నంజంపేట మార్గంలోని జీడిరేవుల వంకపై నిర్మించిన కల్వర్టు కొట్టుకుపోవడంతో ప్రజలే తాత్కాలికంగా ఇసుక బస్తాలతో పనులు చేసుకుని రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఐరాలలో గార్గేయ నది ప్రవాహ వుధృతి కారణంగా సుమారు రెండు గంటల పాటు రాకపోకలు ఆగిపోయాయి. పులిచెర్ల మండలం దేశిరెడ్డిపల్లె సమీపంలో హంద్రీనీవా కాలువకు గండి పడింది. హంద్రీనీవా పరివాహక ప్రాంతాల్లో చెరువులు నిండిపోయాయి. కర్ణాటకలో కురిసిన వర్షాలకు శాంతిపురం మండలంలోని పాలారు నది పరవళ్లు తొక్కుతోంది.

●రొంపిచెర్ల జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సుమారు 30 ఏళ్ల వృక్షం విరిగిపడింది. పాఠశాలకు శెలవు ప్రకటించడంతో పిల్లలు ఎవరూ లేరు.భవనంపై పడకండా పోవడంతో స్కూలుకు ప్రమాదం తప్పింది.



పాలసముద్రం మండలం వనదుర్గాపురంలో నేలకొరిగిన వరి పైరు

నేడూ విద్యాసంస్థలకు సెలవు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాకు భారీ వర్ష సూచన నేపథ్యంలో అన్ని యాజమాన్య పాఠశాలలకు గురువారం సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారిణి వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడైనా విద్యాసంస్థలు నిర్వహిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తూనే వున్న నేపథ్యంలో బుధవారం నుంచి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.ఈ నెల 26వ తేదీ వరకు 24 గంటలూ ఇది పనిచేస్తుందని వివరించారు. ఇందుకోసం రెండు షిఫ్టుల కింద సిబ్బందిని నియమించామన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల నుంచి అందే సమస్యలను, సూచనలను సిబ్బంది నమోదు చేసి డీఆర్వో మోహన్ కుమార్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులకు ఎప్పటికప్పుడు నివేదిస్తారన్నారు. నాలుగు డివిజన్ల అధికారులు లైజన్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తూ వారి పరిధిలో ఏర్పడే విపత్తు వివరాలను నివేదిక రూపంలో డీఆర్వోకు పంపుతారన్నారు. అధికారులందరూ క్షేత్రస్థాయిలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.వంకలు, వాగులు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున పిల్లలను వాటి వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



రొంపిచెర్ల జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో కూలిన 30 ఏళ్ల చెట్టు





చిత్తూరును కమ్మేసిన ముసురు వాతావరణం - విజయపురం మండలం పాతార్కాడులో చెరువు మొరవ

32 మండలాల్లో విస్తారంగా వర్షాలు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గడిచిన 24 గంటల్లో జిల్లాలోని 32 మండలాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. అత్యధికంగా విజయపురంలో 99.2 మి.మీ అత్యల్పంగా పెద్దపంజాణిలో 16.6 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా పెనుమూరులో 86.8, కార్వేటినగరంలో 80.4, వెదురుకుప్పంలో 79.4, పూతలపట్టులో 79.2, ఐరాలలో 59.6, నగరిలో 54.8, రొంపిచెర్లలో 40.6, ఎస్ఆర్‌పురంలో 40.2, జీడీ నెల్లూరులో 37.2, తవణంపల్లెలో 35.8, పాలసముద్రంలో 35.6, చిత్తూరు రూరల్‌లో 35.2, యాదమరిలో 34.4, రామకుప్పంలో 33.8, బంగారుపాళ్యంలో 32.6, చిత్తూరు అర్బన్‌లో 31.8, సోమలలో 31, సదుంలో 29, పులిచెర్లలో 28.4, గుడిపాలలో 27.2, చౌడేపల్లెలో 27, వి.కోటలో 27, గంగవరంలో 26.6, కుప్పంలో 24, శాంతిపురంలో 23.4, బైరెడ్డిపల్లెలో 22.2, పుంగనూరులో 21.2, పలమనేరులో 29.4, గుడుపల్లెలో 18.6 మి.మీ వర్షపాతం నమోదైంది.



సదుం నడిబొడ్డున ఉధృతంగా ప్రవహిస్తోన్న గార్గేయ నది

పెరిగిన టమోటా ధరలు

పుంగనూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):టమోటా ధరలు పెరిగాయి. పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం మొదటిరకం టమోటా కిలో రూ.31.40, రెండోరకం రూ.26, మూడోరకం రూ.22 పలికాయి. మంగళవారంతో పోలిస్తే అన్ని గ్రేడుల టమోటాపై కిలో రూ.6 చొప్పున పెరిగాయి.పలమనేరులో కేటగిరివారీగా కిలో రూ.36.60, రూ.33, రూ.30 వుండగా, వి.కోటలో కిలో రూ.34, రూ.31, రూ.28పలికాయి. మదనపల్లెలో కిలో రూ.41 నుంచి రూ.52 వరకు, రూ.33నుంచి రూ.40 వరకు, రూ.20నుంచి రూ.32 వరకు , కలికిరి మార్కెట్‌లో కిలో రూ.30, రూ.26, రూ.22 మేరకు వ్యాపారులు టమోటాను కొనుగోలు చేశారు.

కేసుల నమోదుతో అజ్ఞాతంలో వైసీపీ నాయకులు

పలమనేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడతో పాటు పలువురు వైసీపీ నాయకులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. పలమనేరు పట్టణంలోని గుడియాత్తం రహదారి పక్కన పార్థ అనే వ్యక్తి నిర్మిస్తున్న భవనం అక్రమమని, అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని పేర్కొంటూ మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, వైసీపీ నాయకులతో కలిసి మంగళవారం ఆయంత్రం ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేసేందుకు విఫల యత్నం చేయడం విదితమే. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ఎస్‌ఐ లోకేష్‌రెడ్డితో సైతం ఆయన దౌర్జన్యకరంగా ప్రవర్తించారు.ఈ సంఘటనలపై బాధితుల ఫిర్యాదు, ఎస్‌ఐ ఫిర్యాదుతో మూడు కేసులు నమోదు చేశారు. పోలీసులు అరెస్టుచేసే అవకాశం ఉన్నందున వైసీపీ నేతలు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ముందస్తు బెయిల్ పొందేందుకు ప్రయత్నిస్తునట్లు సమాచారం.

తిరుపతి మీదుగా బుల్లెట్ రైళ్లు!

ప్రతిపాదనలో హైదరాబాదు - చెన్నై హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్

కారిడార్ అంచనా వ్యయం: రూ.3.04 లక్షల కోట్లు

చెన్నై- హైదరాబాదు నిడివి: 760 కిలోమీటర్లు

జిల్లాలో కారిడార్ వెళ్లేది: 130.58 కిలోమీటర్లు

ఇందులో అటవీ ప్రాంతం: 6.815 కిలోమీటర్లు

సేకరించాల్సిన భూమి: 391.74 హెక్టార్లు

అందులో అటవీ భూమి: 20.445 హెక్టార్లు



తిరుపతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి):తిరుపతి జిల్లాకు మరో మహత్తర ప్రాజెక్టు రానుంది. దక్షిణ మధ్య రైల్వే ప్రతిపాదించిన హైదరాబాదు-చెన్నై హైస్పీడ్ ఎలివేటెడ్ రైల్ కారిడార్ జిల్లా మీదుగా వెళ్లనుంది. ఈ రైల్వే మార్గం రేణిగుంటలోని విమానాశ్రయానికి కనెక్ట్ కానుంది. జిల్లాలో గూడూరు, విమానాశ్రయం వద్ద రైల్వే స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర నివేదికను వచ్చే ఏడాది మార్చిలో రైల్వే బోర్డుకు అందజేయనుంది. బోర్డు ఆమోదం పొందితే వచ్చే ఏడాది బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరిగే అవకాశముంది. హైదరాబాదు నుంచీ దాచేపల్లి వద్ద ఏపీలో ప్రవేశించే రైల్వే కారిడార్ నుంచి నంబూరు, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట విమానాశ్రయం మీదుగా ఏపీలో 504 కిలోమీటర్లు ప్రయాణించి, చెన్నై ఔటర్ రింగ్‌రోడ్డుకు చేరుకుంటుంది. అక్కడ్నుంచి చెన్నై సెంట్రల్ స్టేషన్‌కు కనెక్ట్ కానుంది. ప్రాథమిక డిజైన్‌లో రైల్వే కారిడార్ రేణిగుంటలోని విమానాశ్రయాన్ని కనెక్ట్ చేస్తోంది. కాకపోతే ఎయిర్‌పోర్టు వద్దా లేదా రేణిగుంటకు వెలుపల స్టేషన్ నిర్మాణానికి కూడా రెండు ప్రత్యామ్నాయాలను ప్రతిపాదించింది. విమానాశ్రయంతో కనెక్ట్ చేస్తే విదేశాలు, దూర ప్రాంతాల నుంచీ వచ్చే యాత్రికులకు సౌకర్యంగా ఉంటుంది. దీంతో తిరుపతి ప్రాధాన్యం మరింత పెరగనుంది.

గంటకు 320 కిలోమీటర్ల వేగం

హైదరాబాదు-చెన్నై హైస్పీడ్ ఎలివేటెడ్ కారిడార్‌లో భాగంగా నిర్మించే నూతన రైల్వే మార్గాన్ని గంటకు 350 కిలోమీటర్ల వేగంతో బుల్లెట్ రైళ్ల ప్రయాణించేలా డిజైన్ చేశారు. అయితే ఆపరేషనల్ స్పీడు మాత్రం గంటకు 320 కిలోమీటర్లుగా నిర్ణయించారు. రైల్వే ట్రాక్ నుంచీ సిగ్నలింగ్ సిస్టమ్, స్టేషన్ల వరకూ అన్నీ అత్యాధునికంగా ఏర్పాటు కానున్నాయి. రైల్వే స్టేషన్లు కూడా కనీసం 50 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటవుతాయని సమాచారం. అన్నీ అనుకున్నట్టు జరిగితే మరో రెండు మూడేళ్లలో జిల్లా మీదుగా బుల్లెట్ ట్రైన్లు దూసుకుపోయే అవకాశముంది.

నెలాఖరు వరకు జీతాల బిల్లులకు అవకాశం

- జిల్లాలో 35,748మంది ఉద్యోగులకు డీఏ లబ్ధి

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు ప్రకటించిన కొత్త డీఏ బకాయిలతో అక్టోబరు నెల జీతాల బిల్లులు ఖజానాశాఖకు అందించేందుకు ప్రభుత్వం గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించింది.అక్టోబరు నెల జీతాల బిల్లులు ఖజానా శాఖకు ఈ నెల 17-25 తేదీల మధ్య ఆయా శాఖల డ్రాయింగ్ డిస్‌బర్స్‌మెంట్ ఆఫీసర్లు(డీడీవోలు) స్టేట్‌మెంట్ రూపంలో తయారు చేసి సంతకం చేసి పంపుతున్నారు. దీన్ని అనుసరించి ఇప్పటికే కొన్ని శాఖలు రెండు మూడు రోజుల నుంచి పాత డీఏతో కూడిన జీతాల బిల్లులు సబ్ ట్రెజరీలకు పంపారు. దీన్ని వెనక్కు పంపి ప్రభుత్వం ప్రకటించిన విధంగా 2024 జనవరి 1 నుంచి చెల్లిస్తానన్న 3.64 శాతం డీఏ, డీఆర్ కొత్త బకాయిలు(జీవో నెంబరు 62) ప్రకారం బిల్లులను సవరించి అక్టోబరు నెల బిల్లులు సరిచేయాలని సూచించింది. ఈ బిల్లుల సమర్పణకు గతంలో ఉన్న 25వ తేదీ గడువును ఈ నెల 31వ తేదీ వరకు పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.దీంతో జిల్లాలోని 35,748 మంది ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త డీఏ బకాయిలు అందనున్నాయి.

వివాహం కాలేదని ఆత్మహత్య

● గరుడ వారధి నుంచి దూకిన మదురై యువకుడు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వివాహం కాలేదనే మనోవేదనతో బుధవారం ఉదయం తిరుపతిలోని గరుడ వారధిపై నుంచి దూకి మదురైకి చెందిన పాండియ రాజన్(31) ఆత్మహత్య చేసుకున్నాడు. అలిపిరి ఎస్ఐ లోకేష్‌బాబు తెలిపిన ప్రకారం.. రాజన్ తన కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో తిరుపతికి చేరుకున్న ఇతడు రైల్వేస్టేషన్‌లో కుటుంబ సభ్యులతో సరదాగా గడిపాడు. తాను బస్సులో వస్తానని చెప్పి వారిని


మృతిచెందిన రాజన్

పంపించాడు. అనంతరం కపిలతీర్థం సర్కిల్‌కు చేరుకుని గరుడ వారధిపై నుంచి నడుచుకుంటూ ప్రకాశం మున్సిపల్ పార్కు వద్దకు వచ్చి దూకేశాడు. తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు 112కు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించి ఎస్ఐ కేసు నమోదు చేశారు. మృతుడి వద్ద ఉన్న మొబైల్ నంబరు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. ఎన్ని సంబంధాలు చూసినా పెళ్లి కుదరడం లేదని కొన్ని రోజులుగా అతడు బాధపడుతున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానేంద్రనాథ్ రాయ్, మాజీ మంత్రి ఆర్కే రోజా, నటి రవళి, ప్రభుత్వ సలహాదారుడు ఆర్పీ ఠాకూర్ ఉన్నారు.


జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఒక షెడ్డులో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.4.34 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 76,343

తలనీలాలు సమర్పించినవారు: 18,768





నారాయణవనం, పుత్తూరు మండలాల్లో కైలాసకోన, మూలకోన జలపాతాల జోరు

ముంచెత్తిన వాన


కోట: గూడలి వద్ద పరవళ్లు తొక్కుతున్న స్వర్ణముఖి

గరిష్ఠ వర్షపాతం: శ్రీకాళహస్తిలో 18.4 సెంటీమీటర్లు, కనిష్ఠం: చిన్నగొట్టిగల్లులో 3.1 సెంమీ, 15 మండలాలు: 10 సెంమీకుపైగా వర్షం, జిల్లా సగటు వర్షపాతం: 97.9 మిల్లీమీటర్లు

మండలం	వర్షపాతం (మిమీలలో)
శ్రీకాళహస్తి	184.6
తొట్టంబేడు	176.8
బీఎన్ కండ్రిగ	149.4
పెళ్ళకూరు	144.2
దొరవారిసత్రం	143.8
వడమాలపేట	141.8
సూళ్ళూరుపేట	135.6
ఏర్పేడు	132.8
వెంకటగిరి	126.6
డక్కిలి	124.2
బాలాయపల్లి	112.4
తిరుపతి రూరల్	108.8
గూడూరు	107.2
వరదయ్యపాలెం	103.2
రేణిగుంట	100.6
తిరుపతి అర్బన్	98.4
ఓజిలి	98.2
తడ	97.8
చిల్లకూరు	94.2
రామచంద్రాపురం	88.2
చంద్రగిరి	84.6
కేవీబీపురం	82.2
నాయుడుపేట	80.4
పాకాల	79
సత్యవేడు	78
ఎర్రావారిపాలెం	64
నారాయణవనం	60.4
చిట్టమూరు	58.8
పిచ్చాటూరు	56.6
పుత్తూరు	51.2
నాగలాపురం	48.6
వాకాడు	42.4
కోట	41.4
చిన్నగొట్టిగల్లు	31.6

● వాగులు, వంకలు, జలపాతాల ఉధృతి
● పలు మార్గాల్లో రాకపోకలు బంద్

భారీ వర్షాలు జిల్లాను ముంచెత్తాయి. మంగళవారం లాగే బుధవారమూ వానలు కురిశాయి. దీంతో వాగులు, వంకలు, జలపాతాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నదుల్లోనూ ప్రవాహం మొదలైంది. పలు చోట్ల చెరువుల్లోకి నీరు చేరుతోంది. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండడంతో పలు చోట్ల రోడ్లు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. ఆయా మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లావ్యాప్తంగా 19 మార్గాల్లో 44 ఆర్టీసీ బస్సు సర్వీసులు రద్దయ్యాయి. స్వర్ణముఖి ఉధృతి కారణంగా గుడిమల్లం ఆలయానికి వర్షాలు తగ్గేవరకూ రావద్దంటూ అధికారులు భక్తులను కోరారు. తిరుపతిలోని కపిలతీర్థం, నారాయణవనం మండలం కైలాసకోన, పుత్తూరు మండలం మూలకోన తదితర జలపాతాలు జోరుగా ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల పంట పొలాలు నీటమునిగాయి. తూపిలిపాలెం సముద్రతీరం పరిశీలించిన రెవెన్యూ అధికారులు వేటకు వెళ్లొద్దంటూ మత్స్యకారులకు సూచించారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్

ఈ దారిన రావొద్దు


గూడూరు: పంబలేరు చప్టాపై ఆగిన రాకపోకలు

● బాలాయపల్లి మండలం నిండలి వద్ద కైవల్యానది బ్రిడ్జిపైకి వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

● చిల్లకూరు మండలం తిప్పగుంటపాలెం వద్ద ఉప్పుటేరు కాజ్‌వేపై ఉధృత ప్రవాహంతో వాహనాల రాకపోకలు ఆగాయి.

● గూడూరు పంబలేరు వంతెన వద్ద రోడ్డుపైకి వరద నీరు చేరింది. వాహనాల రాకపోకలను ఆపేసి, పోలీసు కాపలా ఏర్పాటు చేశారు.

● రేణిగుంట మండలం కల్లూరు వంక ఉధృతితో రాకపోకలు ఆగాయి. అత్తూరు మార్గంలో వాగు పొంగడంతో పోలీసులు రాకపోకలు నిలిపేశారు. రేణిగుంట- అన్నాసామిపల్లె మార్గంలో వాగు ఉధృతి కారణంగా రాకపోకలు ఆపేశారు.

● ఏర్పేడు మండలం మోదుగులపాలెం- కొత్తవీరాపురం మార్గంలో స్వర్ణముఖి నది బ్రిడ్జిపైకి నీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసు కాపలా ఉంటున్నారు.

● చావాలింగమనాయుడుపల్లి పంచాయతీలో పాముల కాలువ ఉధృతికి సంతవేలూరు- వరదయ్యపాలెం మార్గంలో వాహనాల రాకపోకలు స్తంభించాయి.

● కేవీబీపురం మండలం కోవనూరు వద్ద వాగు ప్రవాహం రోడ్డుపైకి రావడంతో శ్రీకాళహస్తి-పిచ్చాటూరు మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి.

● నాగలాపురం మండలం నందనం గ్రామానికి రాకపోకలు నిలిచాయి.

● వరదయ్యపాలెం మండలం గోవర్ధనపురం బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహం పెరగడంతో రాకపోకలు నిలిపివేసి పోలీసు కాపలా ఏర్పాటు చేశారు.

● తిరుపతి అర్బన్ మంగళం- శెట్టిపల్లె రోడ్డు కొట్టుకుపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.


ఏర్పేడు: మోదుగుపాళెం వద్ద స్వర్ణముఖి ఉధృత ప్రవాహం


వరదయ్యపాళెం: గోవర్ధనపురం వంతెనపై పోలీసు భద్రత


దొరవారిసత్రం: వెదురుపట్టు రోడ్డులోని పాలకాలువ వంతెనపై వరద


సూళ్లూరుపేట: చెంగాళమ్మ ఆలయం వద్ద కాళంగి నది ఉధృత ప్రవాహం


రామచంద్రాపురం: రాయలచెరువుకు నీటికళ

రోడ్డెక్కిన ప్రవాహం

● చిల్లకూరు మండలం వరగలి క్రాస్ వద్ద రోడ్డుపైకి వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ట్రాఫిక్ స్తంభించింది. ● సూళ్లూరుపేట- కోట పోలూరు మార్గంలో పుచ్చ కాలువ ఉధృతి పెరగడంతో రోడ్డుపైకి నీరు చేరింది. ● సూళ్లూరుపేట మండలం ఇలుపూరు- మంగళంపాడు రోడ్డులో దొండకాలువ పొంగి రోడ్డుపై ప్రవహిస్తోంది.

చిల్లకూరు: వరగలి క్రాస్‌రోడ్డు సమీపాన జాతీయ రహదారిపై ఆగిన వాహనాలు



వాగులు, వంకల ఉధృతి

● డక్కిలి మండలం వెలిగొండ కొండల్లో నుంచీ వచ్చే వాగులన్నీ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువుల్లోకి నీరు చేరుతోంది. కొండేరు వాగు ఉధృతంగా పారుతోంది.

● వెంకటగిరి మండలంలో గుడ్డేరు వాగు, బాలాయపల్లెలో కైవల్యానది జోరుగా ప్రవహిస్తున్నాయి.

● ఏర్పేడు మండలం గుడిమల్లంలోని సీతకాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. నాయుడుపేట, కోట, శ్రీకాళహస్తి వద్ద స్వర్ణముఖి ప్రవహిస్తోంది.


బాలాయపల్లె: నిండలి వద్ద కైవల్యా నది ప్రవాహం

చెరువును తలపిస్తూ..

● రేణిగుంట మండలం అడుసుపాలెం జగనన్న కాలనీ నీట మునిగి చెరువును తలపిస్తోంది. పలు ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. జీపాలెం పంచాయతీ పద్మానగర్ లే అవుట్ నీట మునిగింది. పాంచాలినగర్, భగత్ సింగ్, నేతాజీ కాలనీల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది.

● ఏర్పేడు మండలం ఇసుక తాగేలి పంచాయతీ కార్యాలయంలోకి వర్షపు నీరు చేరడంతో బ్లీచింగ్ పౌడర్, సున్నం బస్తాలు నీటిపాలయ్యాయి. ప్రాథమిక పాఠశాలలోకీ నీళ్లు చేరాయి.

● తిరుచానూరు పంచాయతీ కార్యాలయం వద్దా నీళ్లు చేరాయి.

దెబ్బతిన్న రోడ్లు, చెరువు కట్టలు

● రేణిగుంట మండలం తూకివాకం రైల్వే వంతెన వద్ద నిర్మాణంలోని రోడ్డు వర్షాలకు దెబ్బతింది. రైలింగ్‌తో పాటు మట్టి కూడా దిగువకు జారిపోతోంది.

● ఏర్పేడు మండలం జంగాలపల్లి చెరువుకు నీటి ఉధృతితో రింగ్ బండ్ కొట్టుకుపోయింది. నీళ్లు వృథాగా పోతున్నాయి.

● కేవీబీపురం మండలంలో కాళంగి నది ఉధృతికి పూడి గ్రామాలకు వెళ్ళే మట్టి రోడ్డు కొట్టుకుపోయింది.

సందర్శకులూ ఇటు రావొద్దు

పుత్తూరు మండలం మూలకోన జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఎకో టూరిజం చెక్‌పోస్టు మూసివేసి సందర్శకుల రాకపోకలు నిలిపేశారు.

నీటమునిగిన అండర్ బ్రిడ్జిలు

తిరుపతిలో వెస్ట్ చర్చి వద్ద, ఈస్ట్ పోలీస్ స్టేషన్‌ల వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిలు నీట మునిగాయి. నగరంలోని గొల్లవానిగుంట, సుభాష్ నగర్, అశోక్ నగర్, లీలామహల్ కూడలి, మహిళా వర్శిటీ కూడలి, వైకుంఠపురం కూడలి, ఎమ్మార్‌పల్లి సర్కిల్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి.

17 పశువుల మృతి.. దెబ్బతిన్న పంటలు

శ్రీకాళహస్తిలో ఒక పక్కా ఇల్లు కూలగా, మరొకటి పాక్షికంగా దెబ్బతింది. బీఎన్ కండ్రిగలో నాలుగు గుడిసెలు కూలిపోయాయి. ఓజిలి మండలంలో రెండు గేదెలు, బీఎన్ కండ్రిగలో 15 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. తొట్టంబేడు మండలంలో రెండు ఎకరాల్లో కాకర పంట దెబ్బతినగా నష్టం రూ.60 వేలుగా అంచనా వేశారు.

వరదయ్యపాళెం: అంబూరు వద్ద నీట మునిగిన వరిపంట ←






చెరువులా లక్ష్మీపురం సర్కిల్


తిరుపతిలోని డీఆర్‌మహల్ వద్ద వర్షపునీటితో రైల్వే అండర్ బ్రిడ్జి నిండటంతో బ్యారికేడ్లు పెట్టిన అధికారులు

కల్యాణి డ్యామ్‌కు జలకళ

చంద్రగిరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం ఎ.రంగంపేట సమీపంలోని కల్యాణి డ్యామ్‌లో నీటిమట్టం రెండు రోజుల ముందు 836 అడుగులు ఉండగా.. బుధవారం రాత్రికి 851 అడుగులకు చేరింది. రాగిమానుకోన, అనుమకోన, అబ్బాలమేరు, చీకుమానుకోన, గుండాలపెంట వాగుల నుంచి వరద నీరు ఎక్కువగా వస్తోంది. మరోవైపు స్వర్ణముఖి నదీ ప్రవాహంతో రవణప్పగారిపల్లె వద్ద వంతెనపై రాకపోకలు నిలిచిపోయాయి. ఇక, రేణిగుంట మండలంలోని మల్లిమడుగు రిజర్వాయర్ పూర్తిగా నిండగా.. అరణియార్, కాళంగి రిజర్వాయర్లలోకి నీరు చేరుతోంది. ● వాకాడు మండలంలో స్వర్ణముఖి బ్యారేజీకి ఎగువ నుంచి మూడు వేల క్యూసెక్కులు వస్తుండగా.. 2500 క్యూసెక్కుల నీటిని కిందకు వదులుతున్నారు. మరో 500 క్యూసెక్కుల నీటిని చెరువులకు విడిచిపెడుతున్నారు.


కల్యాణి డ్యామ్‌లో పెరుగుతున్న నీరు

19 మార్గాల్లో బస్సులకు అంతరాయం

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వర్ష ఉధృతి నేపథ్యంలో 19రూట్లలో బుధవారం 44 ఆర్టీసీ బస్సు సర్వీసులను నిలిపేశారు. కొన్ని డిపోలకు పరిమితం కాగా, మరికొన్నింటిని దారి మళ్లించారు. తిరుమల ఘాట్‌లో యథావిధిగా రాకపోకలు సాగించాయి. సీతమ్మకాలువ, కోవనూరుకాలువ, కలవూరు ఏటికాలువ, పున్నేపల్లి, గోవర్ధనపురం, పాపవినాశనం, తాటిమాకులకండ్రిగ, టన్నెల్లి, కురుగొండ, మనమాల, సీఎస్ పల్లి, ఆళత్తూరు, నెన్నూరు, చిన్నబిడికి, బలిరెడ్డిబ్రిడ్జి, కుమ్మరపాళెం, శ్రీనివాసపురం, ఇన్నతోట మార్గాల్లో బస్సు సర్వీసులు ఆగాయి.



రుయాలో రోగుల అవస్థలు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బుధవారం కురిసిన జోరు వర్షానికి రుయాస్పత్రిలోని పలు వార్డుల్లోకి నీరు చేరడంతో రోగులకు తిప్పలు తప్పలేదు. ఓపీకి, వార్డుల్లోకి, వైద్య పరీక్షలకు వెళ్లేందుకు వర్షంలోనూ తడుస్తూ వెళ్లాల్సి వచ్చింది. నడవలేని స్థితిలో ఉన్న రోగులను వర్షంలోనే వారి సహాయకులు వీల్‌చైర్లు, స్ట్రెచర్లపై తీసుకెళ్లాల్సి వచ్చింది. టీబీ వార్డులో శ్లాబు పైకప్పు నుంచి వర్షపు నీరు లీకవడంతో మందులు తడిచి పోయాయి.

దేవదాయ ఆర్జేసీకి జేసీగా అదనపు బాధ్యతలు

తిరుపతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ తిరుపతి రీజనల్ జాయింట్ కమిషనర్ (ఆర్జేసీ) చంద్రశేఖర్ ఆజాద్‌కు ప్రభుత్వం ఆ శాఖ ఎస్టేట్స్ విభాగం జాయింట్ కమిషనర్ (జేసీ)గా అదనపు బాధ్యతలను అప్పగించింది. గొల్లపూడిలోని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలోని ఎస్టేట్స్ విభాగానికి ప్రస్తుతం భ్రమరాంబ జాయింట్ కమిషనర్‌గా వున్నారు. ఆమె ఈనెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ఆ పోస్టులో తిరుపతి ఆర్‌జేసీ ఆజాద్‌ను పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

తిరుమల బూందీపోటులో ఆధునిక యంత్రాలు

తిరుమల, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): తిరుమలలో లడ్డూ ప్రసాదాలకు వినియోగించే బూందీ తయారీ కోసం మరో 10 వేల లీటర్ల థర్మిక్ ఎక్స్ట్రాక్షన్ ట్యాంక్‌ను ఏర్పాటు చేయనున్నారు. కోటిన్నర వ్యయంతో పనులు సాగుతున్నాయి. పోటులో అగ్నిప్రమాదాలకు అవకాశం లేకుండా థర్మో ఫ్లూయిడ్ కడాయ్ సిస్టమ్‌తో కూడి బూందీ తయారీ కేంద్రాన్ని రూ.10కోట్లతో 2020లో ఏర్పాటు చేశారు. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) సంస్థ విరాళంగా ఈ మొత్తాన్ని సమకూర్చింది. ఈ వ్యవస్థకు థర్మిక్ ఆయిల్ సరఫరా చేసే 10 వేల లీటర్ల సామర్థ్యంగల థర్మిక్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. మరింత బూందీ తయారీకి అదనంగా 10 వేల లీటర్ల థర్మిక్ ట్యాంక్ అవసరమని టీటీడీ భావించడంతో సీఎస్‌కే అధినేత శ్రీనివాస్ దీని ఏర్పాటుకు ముందుకొచ్చారు. ప్రస్తుతమున్న ఎంఎస్(మైల్డ్ స్టీల్) పైప్ లైన్‌ను తొలగించి దీని స్థానంలో ఎస్ఎస్ (స్టెయిన్‌లెస్ స్టీల్) పైప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. బూందీ పిండి, చక్కెర పాకం నేరుగా కడాయిల్లోకి చేరేలా పైప్‌లైన్ సిస్టమ్, అధునాత కన్వేయర్‌బెల్ట్ ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నారు. వటికి దాదాపు రూ.5 కోట్లు అవసరమవుతాయని అంచనా వేయగా శ్రీనివాసన్ అంగీకరించినట్టు అధికారులు తెలిపారు. వీటికి సంబంధించి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరితో సీఎస్‌కే సీఈవో, ఎండీ విశ్వనాథన్, టెక్నికల్ కన్సల్టెంట్ శంకర్, రఘునాథన్ బుధవారం చర్చించారు. స్వామి లడ్డూప్రసాదం తయారీలో తాము భాగస్వాములు కావడం సంతోషంగా ఉందని విశ్వనాథన్ 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు.


తిరుమలలో సీఎస్‌కె సీఈవో, ఎండీ విశ్వనాథన్

అల్పపీడనం వేళ అప్రమత్తంగా ఉండండి

● సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్

తిరుపతి(ఆటోనగర్),అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సదరన్ డిస్కం సీఎండీ ఎల్.శివశంకర్ ఆదేశించారు. తిరుపతినుంచి బుధవారం ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే క్రమబద్ధీకరించకుంటే చర్యలు తతీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులు తమ సమస్యలను టోల్ ఫ్రీ నంబర్లు 1912 లేదా 18004251553333లకు తెలియజేయాలన్నారు. సమావేశంలో సంస్థ డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, కె.రామమోహనరావు, సీజీఎంలు పి.సురేంద్రనాయుడు, చక్రపాణి, ఎస్ఈలు పాల్గొన్నారు.


వీసీలో మాట్లాడుతున్న ఎల్.శివ శంకర్

సమస్య పరిష్కారమయ్యే వరకూ పోరాడతాం



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో ధర్నా చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారులు

చిత్తూరు రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సమస్య పరిష్కారం అయ్యేంత వరకు పోరాటం చేస్తామని పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. బుధవారం నాటికి పీహెచ్‌సీ వైద్యుల సమ్మె 22 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శిరీష మాట్లాడుతూ వర్షం పడినా, పిడుగులు పడినా సమ్మె ఆపేది లేదన్నారు. పండగ పూట కూడా వైద్యులందరూ సమ్మెలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత 25 సంవత్సరాలుగా టైమ్ బౌండ్ ప్రమోషన్ల కోసం పోరాటం చేస్తున్నా తమను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. పొరుగు రాష్ట్రాల్లో నిరంతరం అమలు జరుగుతున్న ఈ హక్కును ఆంధ్రప్రదేశ్‌లో అమలుచేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, వైద్యులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత బుధవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆమెను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఐవోసీఎల్ వద్ద మాక్ డ్రిల్



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పూతలపట్టు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రచెరువుపల్లి సమీపాన నూతనంగా ప్రారంభమైన ఐవోసీఎల్ వద్ద బుధవారం స్థానిక పోలీసులతో పాటు అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐవోసీఎల్ వద్ద ఏదైనా ప్రమాదం జరిగితే ఎలా అరికట్టాలనే అంశాలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. అనంతరం సిబ్బందికి కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ కృష్ణమోహన్, ఐవోసీఎల్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, అగ్నిమాపక సిబ్బందితో పాటు ఐవోసీఎల్ అధికారులు రమణరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య లోపం లేకుండా చూడండి



కాణిపాకం బస్టాండ్ వద్ద ప్యాచ్ వర్క్ చేయిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా కాణిపాక వరసిద్ధుని ఆలయ పరిసరాలలో పారిశుధ్య లోపం లేకుండా చూసుకోవాలని పారిశుధ్య అధికారులను ఈవో పెంచలకిషోర్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆయన ఆలయ పరిసరాలలోని బస్టాండ్, కల్యాణకట్ట, మరుగుదొడ్లను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షం కారణంగా ఎక్కడా నీళ్లు నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్తాచెదారం లేకుండా అధికారులు నిత్యం పర్యవేక్షించాలన్నారు. ముసురు వానల కారణంగా ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ వెంకటనారాయణ, ఏఈలు అరవింద్, పవన్, దుర్గా ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనం ఢీకొని 12 మేకల మృతి



సంఘటనా స్థలంలో పోలీసుల విచారణ

బంగారుపాళ్యం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో రోడ్డు దాటుతున్న మేకలను ఓ కంటైనర్ ఢీకొనడంతో 12 మేకలు మృతి చెందినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.ఆయన కథనం మేరకు...బంగారుపాళ్యం మండలం గుండ్లకట్టమంచి హరిజనవాడకు చెందిన మునిరాజ బుధవారం తన మేకలను సమీపంలోని అటవీ ప్రాంతానికి మేతకు తోలుకెళ్లాడు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఇంటికి వస్తూ రోడ్డు దాటించే క్రమంలో ఓ కంటైనర్ లారీ మేకలపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 12 మేకలు అక్కడికక్కడే మృతిచెందాయి. వీటి విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తంచేశాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరుతున్నాడు. సంఘటన జరిగిన వెంటనే సీఐ, ఎస్‌ఐ ప్రసాద్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన కంటైనర్‌ను గుర్తించడానికి సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలులో అవినీతిపై నేడు ఫిర్యాదు

ఎస్పీడీసీఎల్ సీఎండీని కలవనున్న మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు

తిరుపతి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు నేడు తిరుపతిలో ఎస్పీడీసీఎల్ సీఎండీని కలవనున్నారు. సెంటర్ ఫర్ లిబర్టీ సంస్థ తరపున ఇతర ప్రతినిధులతో కలసి ఆయన గురువారం ఉదయం తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీఎండీని కలవనున్నారు. విద్యుత్ శాఖలో రూ. 40 వేల కోట్ల విలువైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలులో భారీ అవినీతి జరిగిందని, టెండర్లలో మోసాలు, అధిక ధరలు కోట్ చేయడం, టెక్నికల్ స్పెసిఫికేషన్ నిబంధనల ఉల్లంఘన వంటి అక్రమాలు చోటు చేసుకున్నాయని సీఎండీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయనున్నారు. దానిపై విచారణలో భాగంగా ఫోరెన్సిక్ ఆడిట్ జరపాలని, టెండర్ల వివరాలను బహిర్గతం చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీఎండీని కోరనున్నారు. ఆయన వెంట సీఎండీని కలిసే బృందంలో సెంటర్ ఫర్ లిబర్టీ సంస్థ ప్రతినిధులు నలమోతు చక్రవర్తి, డాక్టర్ బాబు సింగిరి నలగాంపల్లి సురేష్ తదితరులుంటారు. సీఎండీని కలసి ఫిర్యాదు చేసిన అనంతరం వారు మీడియాతో మాట్లాడనున్నారు.

నిండు కుండలా కృష్ణాపురం జలాశయం





కార్వేటినగరం మండలం కృష్ణాపురం జలాశయం - జలాశయం గేటు ఎత్తడంతో దిగువకు పోతున్న నీరు

వెదురుకుప్పం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కృష్ణాపురం జలాశయం నీటితో నిండు కుండలా మారింది. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల కురిసిన వర్షపునీటితో జలాశయం కళకళలాడుతోంది. చూపరులను ఆకట్టుకుంటోంది. జలాశయానికి వరద నీరు చేరడం వల్ల బుధవారం రెండు గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో ఆ నీరంతా తమిళనాడుకు చేరింది. గేట్లను ఎత్తడం వల్ల కుశస్థలీ నదీ ప్రవాహంలో ఆ నీరు తమిళనాడుకు పోయింది.

అపోలో వర్సిటీలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ విచారణ

విద్యార్థులతో పాటు యాజమాన్యాన్ని, పోలీసులను విచారించిన విజయ భారతి



యూనివర్సిటీ అధ్యాపకులతో మాట్లాడుతున్న విజయభారతి

చిత్తూరు రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చిత్తూరు శివారు ప్రాంతంలోని మురకంబట్టు వద్ద ఉన్న అపోలో యూనివర్సిటీలో ఇటీవల జరిగిన ఘటనలపై బుధవారం నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యురాలు విజయ భారతి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె పోలీసు అధికారులతో కేసులపై విచారించారు. అనంతరం జరిగిన సంఘటనలపై విద్యార్థులను ఆరా తీశారు. యూనివర్సిటీ యాజమాన్యాన్ని, అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని సూచించినట్లు తెలిసింది. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ... యూనివర్సిటీలో ఇటీవల జరిగిన లేడీస్ బాత్ రూంలో హిడెన్ కెమెరా, హాస్టల్ మెస్‌లో ఫుడ్ పాయిజన్ లాంటి ఘటనలపై మీడియాలో కథనాలు చూసి విచారించడానికి వచ్చినట్లు తెలిపారు. హిడెన్ కెమెరాకు సంబంధించి కేసు పోలీసుల విచారణలో వున్నందున పూర్తి వివరాలు వెలువరించలేమన్నారు. అనుమానితుడిని పోలీసులు అరెస్టు చేయగా... ప్రస్తుతం బెయిల్ వచ్చినట్లు తెలిపారు. విచారణను వేగవంతం చేసి దోషులను తొందరగా న్యాయస్థానం ముందు హాజరుపరచాలని పోలీసులను కోరామన్నారు. విద్యార్థులతో మాట్లాడామని, వారందరూ సమస్యలేమీ లేవని చెప్పారన్నారు. యూనివర్సిటీ యాజమాన్యంతో పాటు అధ్యాపకులతో సమీక్షించి సూచనలు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వీసీ వినోద్ భట్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నరేష్‌కుమార్ రెడ్డి, డీఎస్పీ సాయినాథ్, సీఐ నిత్యాబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో వన మహోత్సవాలు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరుకలెక్టరేట్,అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): త్వరలో రాష్ట్ర స్థాయి వలే జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో వన మహోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో హరిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంపొందించే దిశగా జిల్లా అంతటా వ్యవసాయ, వ్యవసాయేతర, ప్రైవేటు భూములు, రహదారుల వెంబడి, కాలువ గట్లు, రైల్వే పట్టాలు, రెవెన్యూ భూములు, పరిశ్రమలు, ప్రభుత్వ సముదాయాలు, బంజరు భూములు, చెరువుల సమీపాల్లో విరివిగా మొక్కలు నాటాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో ఉద్యాన వనాలు, నగర వనాలు, గ్రామాలవారీగా పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్లు, కాలువలు, ట్యాంక్‌బండ్లపై అందుబాటులో ఉన్న బంజరు భూముల్లో మొక్కల పెంపకాన్ని చేపట్టాలన్నారు. డీఎఫ్‌వో జ్ఞాన ప్రకాష్‌రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అడవుల పరిరక్షణలో మమేకమై ప్రజా ఉద్యమంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతామని చెప్పారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు శ్రీదేవి, రవికుమార్, డీఈవో వరలక్ష్మి, కమిషనర్లు, వ్యవసాయ, ఆర్‌అండ్‌బీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంటలపై ఆగని గజదాడులు



ఏనుగుల గుంపు దాడిలో ధ్వంసమైన వరిపంట

కల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజ దాడులు ఆగడం లేదు. మండలంలోని దేవళంపేట, కమ్మపల్లి పంచాయతీల్లో మంగళవారం రాత్రి ఏనుగుల గుంపు చొరబడి పలువురు రైతుల పంటలను ధ్వంసం చేయడంతో తీవ్రనష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతం నుంచి బయలుదేరిన ఏడు ఏనుగుల గుంపు మంగళవారం రాత్రి దేవళంపేట పంచాయతీ గెండేవారిపల్లి వద్దకు చేరుకున్నాయి. రైతు రవి మామిడి తోటలోకి వెళ్లిన ఏనుగుల గుంపు మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి వెంకటమ్మ చెరువు సమీపానికి చేరుకున్న ఏనుగుల గుంపు మిట్టమీదరాచపల్లిలోని బసవయ్య, రమణమ్మలకు చెందిన వరి, టమోటా పంటలను ధ్వంసం చేశాయి. డ్రిప్ పైపులను విరిచేశాయి. దేవళంపేటలోని రైతులు సుధాకర్, ప్రభాకర్‌కు చెందిన వరిపంటను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. కమ్మపల్లిలోని విజయసారథి నాయుడుకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేసిన ఏనుగుల గుంపు కల్లూరులోని గోపాల్‌కు చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. సమీపంలో ఉన్న కలబందలను తినేసిన ఏనుగుల గుంపు వచ్చిన దారిలోనే అడవికి తిరుగుముఖం పట్టాయి. మార్గంమధ్యలో పలువురు రైతుల మామిడిచెట్ల కొమ్మలను విరుచుకుంటూ తూర్పు విభాగం అడవిలోని సూరప్ప చెరువు వద్దకు చేరుకున్నాయి. ఏనుగుల గుంపు దాడిలో ధ్వంసమైన పంటలను బుధవారం ఎఫ్‌ఎస్‌వో మహమ్మద్‌షఫి, ఎఫ్‌బీవో మధు సిబ్బందితో కలిసి పరిశీలించారు. బుధవారం పగలంతా అడవిలోని సూరప్పచెరువు, చాకలికోన వద్ద ఏడు ఏనుగుల గుంపు తిరుగుతున్నట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.

నింగికెగిరిన ఆకాశ దీపం





ఆకాశ దీపాన్ని నింగికి ఎగుర వేస్తున్న ఈవో కిషోర్, ప్రధాన అర్చకుడు సోమశేఖర్ - రాతి ధ్వజ స్తంభంపై ఆకాశ దీపం

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని కాణిపాక క్షేత్రంలో వెలసిన మరగదాంబిక సమేత మణికంఠేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి ఆకాశ దీపాన్ని అర్చక,పండితులు నింగికి ఎగురవేశారు. ఈ సందర్భంగా సాయంత్రం మణికంఠేశ్వర స్వామికి అభిషేకం నిర్వహించారు. స్వామిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం రాత్రి ఆలయంలో వెలసిన రాతి ధ్వజ స్తంభం వద్ద ఆకాశ దీపానికి విశేష పూజలను ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్ నిర్వహించారు. అనంతరం ఆకాశ దీపాన్ని ఈవో పెంచలకిషోర్ నింగికి ఎగురవేశారు. అనంతరం భక్తులకు ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందించారు.ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకు అనుసంధానంగా 'స్కిట్'

శ్రీకాళహస్తి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్కిట్ కళాశాలను జేఎన్‌టీయూకు అనుసంధానం చేస్తూ మంగళవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. నాలుగేళ్ల కిందట మూతపడిన స్కిట్‌ను జేఎన్‌టీయూతో అనుసంధానం చేస్తూ తిరిగి ప్రారంభించేలా ఇటీవల ప్రభుత్వం కసరత్తు చేసిన విషయం తెలిసిందే. కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయింది. 40మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. అధికారికంగా స్కిట్ కళాశాల భవనాన్ని ముక్కంటి ఆలయం నుంచి జేఎన్‌టీయూకు 33 ఏళ్లపాటు లీజు ప్రాతిపదికన కేటాయిస్తూ తుది జీవో విడుదలైంది. దీంతో తరగతుల ప్రారంభానికి అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయి. త్వరలోనే తరగతులు ప్రారంభానికి అధికారులు శ్రీకారం చుట్టనున్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వేదోక్తంగా కోటి బిల్వార్చన



పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కోటి బిల్వ, కుంకుమార్చనను బుధవారం ప్రారంభించారు. కార్తీక మాసం సందర్భంగా ఉదయం 8.45 గంటలకు స్వామి సన్నిధిలో బిల్వార్చన, అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చన ప్రారంభించారు. మధ్యాహ్నం 12.30గంటల వరకు మూడు కాలాల పాటు సాగించారు. తిరిగి సాయంత్రం 5.30గంటల నుంచి 7 గంటల వరకు నాల్గో కాలం అర్చన చేశారు. దీంతో తొలిరోజు అర్చన ముగిసింది.కాగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం రాత్రి ఆకాశదీపాన్ని కన్నులపండువగా వెలిగించారు.కార్తీక మాసంలో రోజూ ఈ దీపాన్ని వెలిగిస్తుంటారు. ఊంజల్ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలు చేసి స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు.

టెన్త్ పరీక్షలకు వయో సడలింపులు

- 14 ఏళ్లలోపు విద్యార్థులకూ అవకాశం

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తక్కువ వయస్సు కలిగిన స్థాయికి మించి సామర్థ్యం కలిగిన విద్యార్థులకు టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాసేందుకు విద్యాశాఖ అవకాశం కల్పిస్తూ మార్గదర్శకాలు విడుదల చేసింది. అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే పరీక్షలు రాసేందుకు వెసులుబాటు ఇచ్చింది. టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు 31.8.2025 నాటికి 14 ఏళ్లు నిండి ఉండాలి. ఈ నిబంధనను ప్రాథమిక అర్హతగా విద్యాశాఖ నిర్ణయించింది. ఒకవేళ 14 ఏళ్లలోపు విద్యార్థులు పరీక్ష రాయాలంటే అలాంటి వారికి వయో సడలింపునిచ్చింది. ఈ మేరకు పలు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంది. తక్కువ వయస్సు కలిగిన విద్యార్థులు టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాయాలంటే... ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వయస్సు 18 నెలలు తక్కువుంటే గెజిటెడ్ హోదా కలిగిన ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆమోదంతో ధ్రువీకరణ సంతకం చేయించాలి. అలాగే ప్రైవేటు, ఎయిడెడ్ విద్యార్థులైతే జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) అనుమతి తీసుకోవాలి. రెండేళ్లు తక్కువున్న విద్యార్థులెవరైనా సరే ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు (డీజీఈ) ఆమోదం తీసుకోవాల్సి ఉంది. వయో సడలింపు నిమిత్తం రూ.300 చలానా, మెడికల్ సర్టిఫికెట్, బర్త్ సర్టిఫికెట్ సమర్పించాలి. ఈ పత్రాలతో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. పూర్తి పరిశీలన తర్వాత అభ్యర్థి టెన్త్ పబ్లిక్ పరీక్షలకు అనుమతించాలనే దానిపై జిల్లా విద్యాశాఖాధికారులు నిర్ణయం తీసుకుంటారు.

హంద్రీ-నీవా కాలువకు గండి



హంద్రీ-నీవా కాలువకు గండి పడటంతో ప్రవహిస్తున్న నీరు

కల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కమ్మపల్లి పంచాయతీ దేశిరెడ్డిగారిపల్లి సమీపంలోని హంద్రీ-నీవా కాలువకు గండి పడింది. ఇటీవల మండలంలో కురిసిన భారీ వర్షాలతో కుంటలు, చెరువులు నీటితో జలకళలాడుతున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో హంద్రీ-నీవా కాలువ వర్షపు నీటితో ప్రవహిస్తోంది. దేశిరెడ్డిగారిపల్లి సమీపంలో బుధవారం ఉదయం హంద్రీ-నీవా కాలువకు గండి పడటంతో కాలువకు దిగువన ఉన్న రైతులు కృష్ణారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, యల్లారెడ్డి, ప్రసాద్ రెడ్డి, శరణ్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, అమరనాథరెడ్డి, గోవర్ధన్, కౌలు రైతులు వీరభద్రయ్య, సుబ్రహ్మణ్యంకు చెందిన వరి పంటలు నీట మునిగాయి. హంద్రీ-నీవా కాలువ నుంచి వస్తున్న నీరు ఆ రైతుల వరి పొలాల్లో కురవపల్లి సమీపంలోని పెద్దచెరువుకు చేరుకుంటున్నాయి. ఇదే చెరువు నుంచి కురవపల్లికి తాగునీరు అందించే బోరు ఉండటంతో బోరు పూర్తిగా మునిగిపోయింది. దీంతో కువరపల్లి ప్రజల తాగునీటికి ఇబ్బందులు తలెత్తనున్నాయి.

గువ్వలగుట్ట కల్వర్టుకు రూ.50 లక్షల మంజూరు



గువ్వలగుట్ట పరిశీలనకు కాలి నడకన వెళుతున్న కలెక్టర్ తదితరులు (ఫైల్ ఫొటో)

సోమల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చెన్నపట్నం చెరువు మొరవపై శాశ్వత కల్వర్టు నిర్మాణానికి జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చొరవ తీసుకుని బుధవారం రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు సోమల ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, చెన్నపట్నం చెరువు నీటి సంఘ అధ్యక్షుడు గల్లా బోస్ తెలిపారు. సెప్టెంబరు 22న భారీ వర్షాలతో గువ్వలగుట్ట మార్గంలోని కల్వర్టు కొట్టుకుపోవడంతో కలెక్టరు కల్వర్టును, చెన్నపట్నం చెరువును సందర్శించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెన్నపట్నంకు మరింత వర్షం నీరు చేరి వేసిన తాత్కాలిక కల్వర్టు కొట్టుకుపోయింది. గువ్వలగుట్టకు రాకపోకలు స్తంభించాయి. సమాచారం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన స్పందించి రూ.50 లక్షలు మంజూరు చేశారు. నిధులు మంజూరు చేయడంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

రోడ్డుపై వరినాట్లతో బీసీవై నిరసన



కత్తార్లపల్లె వద్ద రోడ్డుపై వరినాట్లతో నిరసన తెలుపుతున్న బీసీవై నాయకులు

పుంగనూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక-ఆంధ్రప్రదేశ్ అంతర్రాష్ట్ర సరిహద్దులోని పుంగనూరు రోడ్డు గుంతలమయంగా ఉండటంతో బీసీవై కత్తార్లపల్లె క్రాస్ వద్ద ఏర్పడిన పెద్దపెద్ద గుంతల్లో వరినాట్లు వేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు రమేశ్‌యాదవ్, పూల ప్రేమ్‌కుమార్, హరిబాబు యాదవ్ మాట్లాడుతూ బెంగళూరు-పుంగనూరు మార్గంలో వ్యాపారులు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రైవేటు కార్మికులు, రోగులు, బోయకొండ ఆలయానికి భక్తులు రోజూ వేలమంది ప్రయాణిస్తున్నారని వాపోయారు. పుంగనూరు నుంచి కత్తార్లపల్లె క్రాస్ వరకు అడుగడుగునా గుంతలు ఉన్నాయని.. వాహనాల్లో ప్రయాణంతో అవస్థలు పడుతున్నారని. ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భాను, సురేశ్ యాదవ్, వెంకటేశ్, గిరిబాబు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గుంతలరోడ్డుపై ఇరుక్కుపోయిన కారు



కత్తార్లపల్లె క్రాస్ వద్ద రోడ్డుపై గోతిలో ఇరుక్కుపోయిన కారు

పుంగనూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు సమీపంలోని కత్తార్లపల్లె క్రాస్ వద్ద రోడ్డుపై చాలా కాలంగా ఏర్పడిన పెద్దపెద్ద గుంతల్లో బుధవారం ఓ కారు ఇరుక్కుపోయింది. పుంగనూరు నుంచి బెంగళూరుకు వెళుతున్న కారు గుంతలో దిగి వెనుకకు, ముందుకు రాకుండా ఆగింది. వర్షం కారణంగా రోడ్డుపై ఉన్న గుంత కనిపించకపోవడంతో కారు ఇరుక్కుంది. పుంగనూరు నుంచి సింగిరిగుంట, అరవపల్లె, కత్తార్లపల్లె క్రాస్ రోడ్డు వరకు అడుగడుగునా రోడ్డు దుస్థితికి చేరింది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని పుంగనూరు-బెంగళూరు రోడ్డు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా అంతర్రాష్ట్ర రహదారి

పలమనేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు-గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారిలో పలమనేరు మండలం కాలువపల్లి గ్రామ సమీపంలో అటవీ ప్రాంతం నుంచి కౌండిన్య జలాశయానికి వెళ్లే నీటికోసం నిర్మించిన వంతెనకు గండి పడింది. నడిరోడ్డుపై వంతెనకు గండిపడటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ గండిని అధికారులు పట్టించుకోక పోవడంతో కాలువపల్లి గ్రామస్తులు నడిరోడ్డుపై పడిన గండి వద్ద కొన్ని చెట్ల కంపలను వేశారు. ఏమాత్రం వాహనదారులు గమనించకుండా ఈ గండిపై ప్రయాణిస్తే పెనుప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. అధికారులు స్పందించి గండికి వెంటనే మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.



అంతర్రాష్ట్ర రహదారి మధ్యన కాలువపల్లి సమీపంలో రోడ్డుపై పడిన గండి

శ్రీరామ విలాస సభలో ఎమ్మెల్యే జగన్మోహన్



శ్రీరామ విలాస సభలో ఫొటోలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్ తదితరులు

చిత్తూరు సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జగన్మోహన్ బుధవారం స్థానిక సంతపేటలోని శ్రీరామ విలాస సభను సందర్శించారు. భవన నిర్మాణాన్ని, నాటి ప్రముఖుల ఫొటోలను, భవనం లోపలి ప్రదేశాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు వారసత్వ సంపదకు సాక్ష్యంగా నిలిచిన శ్రీరామ విలాస సభకు దాతల సాయంతో పూర్వవైభవాన్ని తీసుకువస్తామన్నారు.

ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలి

● ఎమ్మెల్యే మురళీమోహన్



సామనత్తం వద్ద మురుగునీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తతతో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే మురళీమోహన్ కోరారు. బుధవారం ఆయన అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పూతలపట్టు సమీపాన గల భీమానది, సామనత్తం వంక, పంటపల్లి వంక, పోతినాయని చెరువు, ఆకనంబట్టు వంక ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులు, వాగులు, కుంటల వద్ద ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, రైతులు పొలాలకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే ప్రభుత్వాధికారులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం పూతలపట్టు మండల పరిస్థితిపై జిల్లా కలెక్టర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు దొరబాబు చౌదరి, జిల్లా అధికార ప్రతినిధి గంగారపు గోపి, మాజీ కన్వీనర్ ప్రతాపనేని చంద్రమౌళి, నాయకులు మునిక్రిష్ణమ నాయుడు, ప్రతాపనేని ఇందిర, సురేంద్ర నాయుడు, ఎంపీడీవో నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వైద్యపరీక్షలు



పలమనేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు సమీపంలోని బాలికల గురుకుల పాఠశాలను జిల్లా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటప్రసాద్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి హనుమంతరావు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. విద్యార్థినులు వేడివేడి ఆహారాన్ని తీసుకోవాలని, కాచిన నీటిని తాగాలని, బయట ఆహారాన్ని తినరాదని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, సబ్‌యూనిట్ అధికారి జయశంకర్, ఆరోగ్యకార్యకర్తలు అరుణ, స్టాఫ్‌నర్సు సుజాత, ఆశ కార్యకర్త భాగ్యమ్మ పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

పలమనేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గత రెండురోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పలమనేరులోని ముంపు ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి బుధవారం పర్యటించి పరిశీలించారు. పలమనేరులోని ఎద్దుల చెరువు కలుజు ప్రవహించే ప్రాంతాన్ని, గాంధీనగర్, సిల్కుఫారం తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. శిథిలమైన ఇళ్లల్లో నివాసముంటే వారిని సురక్షిత ప్రాంతంలో ఉండేందుకు చర్యలు చేపట్టారు.



ఇళ్ల పరిసరాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

2న తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి వార్షికోత్సవం

పలమనేరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి 13వ వార్షికోత్సవాన్ని పలమనేరులోని కళామందిరంలో నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్ష, కార్యదర్శులు పి.తులసినాథంనాయుడు, పుష్ప దంపతులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవంలో పద్యాల పోటీల్లో గెలుపొందిన 50 మందికి బహుమతులు ఇవ్వడంతో పాటు పురస్కారాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలుగు భాషాభిమానులు, సాహితీ ప్రియులు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

చౌడేపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకొండామారి సమీపంలోని కోళ్లఫారం వెనుక జూదం ఆడుతుండగా దాడులు చేసి బుధవారం ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపారు. వారి నుంచి రూ.10,140 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దాడుల్లో ట్రైనీ ఎస్‌ఐ మణికంఠేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య



మునిరత్నం (ఫైల్‌ఫొటో)

పుంగనూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మ హత్యకు పాల్పడిన సంఘటన పుంగనూరు మం డలం సింగిరిగుంట పంచాయతీ మార్లపల్లెలో బుధవారం జరిగింది. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు.. సింగిరిగుంటకు చెందిన వెంకటరమణ కుమారుడు మునిరత్నం(52) వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ కలహాలతో మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి బుధవారం సాయంత్రం గ్రామ సమీపంలోని ఎర్ర చెరువు మొరవ వద్ద చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వెంకటరమణ సంఘటనా స్థలానికి చేరుకుని మునిరత్నం మృతికి గల కారణాలపై విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోయకొండలో నేటి వేలం పాటల వాయిదా

చౌడేపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో గుజరీ సేకరించుకునేందుకు 23న గురువారం నిర్వహించనున్న వేలం వాయిదా వేసినట్లు ఆలయ ఈవో ఏకాంబరం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్షం కారణంగా వాయిదా వేశామని.. తదుపరి తేదీని తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు.

కలుషిత నీటితో విజృంభిస్తున్న జ్వరాలు



జ్వరంతో మల్లీశ్వరి



జ్వరంతో నాగరాజునాయుడు

గుడిపాల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన బోర్లు వర్షానికి నీట మునగడంతో తాగునీరు కలుషితమైంది. ఈ కలుషిత నీటిని తాగడంతో జ్వరాలు విజృంభిస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కొండాపురం, దళవాయిపల్లె తదితర గ్రామాల్లో ప్రజలు కలుషిత నీరు తాగారని తెలిపారు. జ్వరాలున్న గ్రామాల్లో మెడికల్ క్యాంపు నిర్వహించాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా గ్రామాల సమీపంలో పేడ దిబ్బలు ఉండటంతో దోమల బెడద ఎక్కువగా ఉందని గ్రామస్తులు తెలిపారు.

రోజంతా ముసురువాన

చిత్తూరు అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావం కారణంగా బుధవారం నగరంలో ముసురుతో తేలికపాటి చిరుజల్లులతో కూడిన వర్షం పడింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఆకాశం మబ్బులతో కనిపించింది. విడతలు విడతలుగా తేలికపాటి వర్షం పడటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రాలేకపోయారు. వర్ష ప్రభావం కారణంగా ముందుగానే పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో విద్యార్థుల తాకిడి కనిపించలేదు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులతో పాటు కార్మికులు యథావిధిగా విధులకు హాజరయ్యారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా నీవానదితో పాటు మిట్ట ప్రాంతాల్లోని వర్షపు నీరంతా సంతపేటరోడ్డుపై ప్రవహించింది. దాంతో నగరపాలక అధికారులు అరగొండ-సంతపేట రోడ్డులో అండర్‌పైపు లైన్‌ను ఏర్పాటు చేశారు. వ్యాపారాలు లేకపోవడంతో చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.

విజ్ఞాన భాండాగారంపై వీడని నిర్లక్ష్యం

● ఉరుస్తున్న కుప్పం గ్రంథాలయం ● పరిశీలించిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులు

కుప్పం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు. అవి రేపటి మేధావులను తయారు చేసే ఉత్పత్తి కేంద్రాలు. అటువంటి విజ్ఞాన భాండాగారాలపై అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. ముఖ్యంగా కుప్పం ప్రభుత్వ గ్రంథాలయాన్ని పట్టించుకునే దిక్కులేక అల్లాడుతోంది. ఉదయం నుంచి కురుస్తున్న ముసురు వానకు ముద్దగా తడుస్తూ, తనలోని గ్రంథాలను కాపాడుకోలేక కన్నీళ్లను 'కురుస్తోంది.'

చేరెడు హాలు.. మూరెడు వరండా, కనీసం రెండు కుర్చీలు కూడా పట్టని చిన్న గది. ఎప్పటిదో పురాతన కాలంనాటి పెచ్చులూడుతున్న భవనంలో కుప్పం ప్రభుత్వ గ్రంథాలయం బితుకుబితుకుమంటూ కాలం గడుపుతోంది. ఆర్టీసీ బస్టాండు సమీపంలో నేతాజీ రోడ్డులో ఉన్న ఈ భవనం ముందు భాగాన్ని హ్యాకర్లు ఆక్రమించేశారు. పాఠకులు వారిని దాటుకుని గ్రంథాలయంలోకి వెళ్లడానికి కుప్పిగంతులు వేయాలి. ఇక ద్విచక్ర వాహనాలు పార్కింగ్‌కు కనీసమైన స్థలం లేదు. ఈ పాతకాలంనాటి గ్రంథాలయ భవనం పైకప్పు పెచ్చులూడి ఐరన్ రాడ్స్ బయట పడ్డాయి. బుధవారం ఉదయం నుంచి కురుస్తున్న ముసురు వానకు ఆ పైకప్పులోనుంచి వాన చినుకులు ఊరి ఊరి, లోపలికి రాలుతున్నాయి. అంటే భవనం పైకప్పు బాగా ఉరుస్తోంది. పాఠకుల నెత్తిమీదే కాదు.. ర్యాకుల్లో పేర్చిన పుస్తకాలపై ఉరుస్తున్న వాన నీరు పడుతోంది. చిన్నపాటి హాలులో పుస్తకాలను అటూఇటూ.. ఎటు మార్చినా ఉరుపు లేనిచోటు లేకపోవడంతో గ్రంథాలయాధికారికి అవస్థలు తప్పడంలేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మునస్వామి ప్రభుత్వ గ్రంథాలయాన్ని సందర్శించారు. ఉరుస్తున్న పెచ్చులూడిన పైకప్పును, పాఠకులు పడుతున్న అవస్థలను, తడుస్తున్న పుస్తకాలను పరిశీలించారు. త్వరలోనే నూతన భవనం నిర్మించి అందులోకి గ్రంథాలయాన్ని మార్చడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి వెళ్లారు.

● **ఎందుకింత నిర్లక్ష్యం?**

రామకుప్పం మండలానికి చెందిన రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మునస్వామి ఇదివరకూ ఇదేరకమైన హామీని ఇచ్చారు కానీ అమలు కాలేదు. కుప్పం ప్రభుత్వ గ్రంథాలయం కొనసాగుతున్న దుస్థితిపై గతంలో చాలాసార్లు పాఠకులు టీడీపీ కార్యాలయంలో నడుస్తున్న జననాయకుడు ఫిర్యాదుల విభాగంతోపాటు, కడా పీడీ వికాస్ మర్మత్ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సైతం ఫిర్యాదు చేశారు. అయితే ఎటువైపు నుంచీ కనీస స్పందన లేదు. గ్రంథాలయాలన్నా, ఆ గ్రంథాలను చదువుతున్న పాఠకులన్నా అధికారులకు ఎందుకింత నిర్లక్ష్యమని కుప్పం ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కడా పీడీ అనుకుంటే గ్రంథాలయ సమస్యను పరిష్కరించే అవకాశం ఉంది. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవన సముదాయంలోనో ... మరో చోటనో చిన్నపాటి గది చూసి గ్రంథాలయాన్ని అందులోకి మార్చడానికి వీలుంది. అయినా ఆ దిశగా ఆయన చర్యలు తీసుకోవడంలేదు.



పెచ్చులూడి ఉరుస్తున్న కుప్పం ప్రభుత్వ గ్రంథాలయం పైకప్పు



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులు

ఫలితంగా ఎప్పటెప్పటివో విలువైన గ్రంథాలు వానకు తడిసి పాడైపోతున్నాయి. ఏ దురదృష్టకరమైన క్షణంలోనైనా పాత భవనం పెచ్చులూడి అందులోని పాఠకులకు ఏదైనా అయితే ఎవరు జవాబుదారీ అని స్థానిక ప్రజలు నిలదీస్తున్నారు. కనీసం ఈ తుఫాన్ వేళనైనా అటువంటి ప్రమాదాన్ని నివారించాలంటే కుప్పం ప్రభుత్వ గ్రంథాలయాన్ని వెంటనే సురక్షితమైన భవనంలోకి మార్చాల్సిన అవసరం ఉంది.

విస్తారంగా వర్షాలు..!

● కళకళలాడుతున్న జల వనరులు
● పలు మండలాల్లో రైతుల ఆనందం



నిండు జలాలతో సింగసముద్రం పెద్దచెరువు



కొత్తచెరువు మొరవ వద్ద యువత



నిండుకుండలా ఎస్.గొల్లపల్లె కొత్తచెరువు

రామకుప్పం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో ఓ వైపు విస్తారంగా కురుస్తున్న వర్షాలు, హంద్రీ-నీవా కాలువలో వస్తున్న కృష్ణాజలాలతో మండలంలోని జలవనరులు జలకళను సంతరించుకుంటున్నాయి. గత పదిహేను రోజులుగా మోస్తరు వర్షాలు, రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఆ జలాలు చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంల్లోకి చేరుతున్నాయి. మండలంలోని పెద్దచెరువులైన ఎస్.గొల్లపల్లె కొత్తచెరువు, సింగసముద్రం పెద్దచెరువు, కెంచనబల్ల తోట్ల చెరువులతో పాటు చిన్న, మధ్యతరహా చెరువులు వర్షపునీటితో నిండుతున్నాయి. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు ఎస్.గొల్లపల్లె కొత్తచెరువు నిండుకుండలా దర్శనమిస్తోంది. కొత్తచెరువు మొరవ ఉధృతంగా ప్రవహిసుండటంతో రైతులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సింగసముద్రం చెరువు పూర్తిగా నిండి, నేడో, రేపో మొరవ ప్రవాహానికి సిద్ధమవుతోంది. అటవీప్రాంతంలోని 89పెద్దూరు, ముద్దనపల్లె, ననియాలతాండా, చిక్కపల్లెతాండా, బల్ల పంచాయతీల పరిధిలోని చెరవులు సైతం జలకళను సంతరించుకుంటున్నాయి. మరోవైపు హంద్రీ-నీవా కాలువలో వచ్చిన కృష్ణాజలాలు, వర్షపునీటితో అత్తికుప్పం వీరాశిచెరువు, చింతకుప్పం, జిల్లాని చెరువులు నిండి మొరవలు పోతోంది. ఆ చెరువుల నుంచి మణీంద్రం చెరువుకు జలాలు వెళ్తున్నాయి. పూర్తిగా ఎండిపోయి న మణీంద్రం చెరువు ప్రస్తుతం జలకళను సంతరించుకుని రైతుల్లో సంతోషాన్ని నింపుతోంది.

● **సోమల:** సోమల మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు పలుచోట్ల కల్వర్టులు కొట్టుకుపోయాయి. అయినా ప్రజలు కల్వర్టు దాటుతూ ప్రయాణాలు సాగిస్తున్నారు. ప్రమాదం అని తెలిసినా దాటుతున్నారు. సోమల-నంజంపేట మార్గంలోని జీడిరేవుల వంక వద్ద ఉధృతి కొంత తగ్గడంతో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. పెద్ద ఉప్పరపల్లె వద్ద గార్గేయనదీ ప్రవాహాన్ని దాటుకొని రెడ్డివారిపల్లె, బసవపల్లె, పేటూరు, చిన్నకమ్మపల్లె బోనమంద గ్రామాల ప్రజలు ప్రయాణాలు సాగిస్తున్నారు. పెద్దఉప్పరపల్లె - చౌడేపల్లె మార్గంలో భారీ వర్షాలకు పలు చోట్ల రాకపోకలు స్తంభించాయి. చెన్నపట్నం చెరువు మొరవ నీటి ఉధృతితో తాత్కాలిక కల్వర్టు కొట్టుకుపోయింది. ఈక్రమంలోనే గువ్వలగుట్ట ప్రజలు తప్పని పరిస్థితిలో మొరవ వద్ద వెళ్తున్నారు.

● **రొంపిచెర్ల:** రొంపిచెర్ల మండలంలో కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు పూర్తిగా నిండాయి. పలు చెరువులు మొరవ పోతున్నాయి. గానుగచింత పంచాయతీ పరిధిలోని వెంకటసముద్రం (ఏటిచెరువు) చెరువుకు నీరు పుష్కలంగా చేరి మొరవపోతుంది.



కృష్ణాజలాలతో కళకళలాడుతున్న మణీంద్రం చెరువు



సోమల: పెద్ద ఉప్పరపల్లె సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న గార్గేయనది



రొంపిచెర్లలోని గానుగచింత వద్ద మొరవ పోతున్న ఏటిచెరువు

పొంగిపొర్లుతున్న గార్గేయనది

● పూతలపట్టులోనూ భారీ వర్షం
● మూడు గంటల పాటు రాకపోకలకు ఇబ్బంది



తహసీల్దార్ కార్యాలయం వద్ద పారుతున్న గార్గేయనది

ఐరాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలంలో మంగళవారం రాత్రి కుండపోతగా వర్షం కురిసింది. ఉదయం నుంచి పూర్తిగా తెరలు తెరలుగా వర్షం కురిసి రాత్రి దంచి కొట్టింది. ఐరాలకు సమీపంలోని బీరప్పచెరువు దగ్గర్లోని అటవీ ప్రాంతంలో ఎక్కువ శాతం వర్షం కురవడంతో గార్గేయి నది పరవళ్లు తొక్కింది. రాత్రి గార్గేయినది తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉధ్రుతంగా ప్రవహించి ఉదయం మోస్తారుగా సాగింది. బుధవారం ఉదయం మూడు గంటల పాటు నదిపై వాహనాలు అటుఇటు ప్రయాణించ లేకపోయాయి. వర్షం అధికంగా పడటంతో చిన్నచిన్న కుంటలు నిండిపోయాయి. వంక సాగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బోర్లు, బావుల్లో నీటిమట్టం పెరిగినట్లు తెలిపారు.

● **పూతలపట్టు:** గత రెండ్రోజులుగా పూతలపట్టులో కురుస్తున్న వానలకు వాగులు, వంకలు నిండడంతో పాటు గ్రామీణ ప్రాంతాలు కూడా తడిసి ముద్దయ్యాయి. వర్షపునీటితో వీధులన్నీ జలమయమయ్యాయి. పూతలపట్టు సమీపాన గల భీమానది, నీవానదితో పాటు పలు చెరువులకు నిండుగా నీరు చేరాయి. కమ్మగుట్టపల్లి పంచాయతీ పేటపల్లి వద్ద పూతలపట్టు నుండి ఐరాల మండలానికి వెళ్లే రోడ్డు జలమయమైందని స్థానిక ఎంపీటీసీ విజయలక్ష్మి మండల టీడీపీ అధ్యక్షుడు దొరబాబు చౌదరికి సమాచారం ఇవ్వడంతో స్పందించిన ఆయన, మాజీ కన్వీనర్ చంద్రమౌళి, మాజీ సర్పంచ్ కార్తికేయ చౌదరి, నేతాజీల సహకారంతో జేసీబీ ద్వారా మురుగునీటిని తొలగించారు.

కేతమానికుంట, బుటకపల్లె చెరువులకు గండ్లు



గండి పడిన బుటకపల్లె చెరువు

చౌడేపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు చెరువులకు గండ్లు పడ్డాయి. బుధవారం మండలంలోని పందిళ్లపల్లె పంచాయతీలోని కేతమానికుంట చెరువుకు, దుర్గసముద్రం పంచాయతీలోని బుటకపల్లె చెరువుకు గండ్లు పడ్డాయి. గుర్తించిన గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే రెవెన్యూ అధికారులు ఎక్స్‌కవేటరుతో ఇసుక, మట్టి వేసి గండ్లు పూడ్చారు. అలాగే పరికిదొన పంచాయతీలోని బాలప్పకుంట కట్టలో నీరు లీక్ అవుతుండటంతో కట్టకు ప్రమాదం పొంచి ఉంది. మండలంలోనే పెద్ద చెరువుల్లో ఒకటైన శెట్టిపేట చెరువు నిండి మొరవ పోతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం మోస్తారుగా కురుస్తుండటంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



కేతమానికుంట చెరువు గండిని ఎక్స్‌కవేటర్‌తో పూడ్చుతున్న అధికారులు

శ్రీరామ విలాససభలో ఎమ్మెల్యే



శ్రీరామ విలాససభలో ఫొటోలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్ తదితరులు

చిత్తూరు సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జగన్మోహన్ బుధవారం స్థానిక సంతపేట లోని శ్రీరామ విలాస సభను సందర్శించారు. భవన నిర్మాణాన్ని, నాటి ప్రముఖుల ఫొటోలను, భవనం లోపలి ప్రదేశాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు వారసత్వ సంపదకు సాక్ష్యంగా నిలిచిన శ్రీరామ విలాస సభకు దాతల సాయంతో పూర్వ వైభవాన్ని తీసుకువస్తామన్నారు.

వర్షాలపై కార్పొరేషన్ అప్రమత్తత



సంతపేట వద్ద అండర్ పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నగర కమిషనర్ నరసింహ ప్రసాద్ బుధవారం నగరంలో విస్తృతంగా పర్యటించారు. బుడమాల చెరువు నుంచి వస్తున్న నీటిని పరిశీలించారు. సంతపేట ప్రధాన రహదారి, డీబీరోడ్డులో పర్యటించి అధికారులకు మార్గనిర్దేశం చేశారు. అనంతరం వీరభద్రకాలనీ, ధర్మరాజులగుడివీధి, లిల్లీబ్రిడ్జి, కైలాసపురం వంతెన ప్రాంతాల్లో నీవానదిలో నీటి మట్టాలను పరిశీలించారు. అంతకుముందు వర్షాల పరిస్థితి, ముందస్తు అప్రమత్తతపై ప్రజారోగ్య విభాగం, ఇంజనీరింగ్, ప్రణాళిక విభాగం అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో లోకేష్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలం



నగరపాలక కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కార్పొరేషన్, మున్సిపాలిటీలోని పారిశుధ్యం, ఇంజనీరింగ్, డ్రైవర్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు నాగరాజన్ విమర్శించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం చిత్తూరు నగరపాలక కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేశారు. నాగరాజన్ మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రిన్సిపల్ సెక్రటరీ జోక్యం చేసుకుని యూనియన్ నేతలను చర్చలకు పిలిచి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే వచ్చే నెల 3వ తేదీ నుంచి సమ్మెకు వెళతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఆ సంఘ నేతలు గోపినాథ్, మణి, రఘు, బాలాజీరావు, కార్మికులు పాల్గొన్నారు.

స్కందషష్ఠి ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్య స్వామి

నగరి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని కరకంఠేశ్వర స్వామి ఆలయంలో స్కందషష్ఠి ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం గణపతి పూజ, వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. షట్ హారతి పూజలు, ఊంజల్‌సేవ నిర్వహించిన అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు, ఉభయదారులకు ఆలయ మర్యాదలు చేశారు. ఈ నెల 27న సూరసంహారం, 28న కల్యాణోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం తెలిపారు. ఏకాంబరకుప్పం సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో స్కందషష్ఠిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా మహాస్కంద షష్ఠి వ్రతం

చిత్తూరు సిటీ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరింపేటలోని చెంగల్వ రాయకొండపై వెలసిన వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మహా స్కంద షష్ఠి వ్రతాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. బుధవారం నుంచి ఈనెల 28వ తేది వరకు మహాస్కంద షష్ఠి వ్రతం, స్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ప్రతిరోజు ఉదయం విశేష అభిషేక పూజలు, 27వ తేది ఉదయం 5 గంటలకు మహాస్కంద షష్ఠి కలశస్థాపన, హోమం, శత్రుసంహార అర్చన నిర్వహిస్తారు. 28వ తేది సాయంత్రం 5 గంటలకు వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలను దివంగత సత్యప్రభ, ఆదికేశవులు నాయుడు కుటుంబం నిర్వహిస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వీధిలైట్ల పంపిణీ



వీధిలైట్లు పంపిణీ చేస్తున్న నేతలు ధనంజయ నాయుడు, శిల్ప

గంగాధరనెల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అధికారుల సహకారంతో వరత్తూరు పంచాయతీ పరిధిలోని గ్రామాలకు 50 వీధిలైట్లను జిల్లా తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయ నాయుడు, టీడీపీ మహిళానేత పొదిలి శిల్ప కలిసి బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు ఏకాంబరరెడ్డి, ఉమాపతి, శివలింగారెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, బీ.ఎన్.రెడ్డి, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..!



చిత్తడిగా మారిన జానకారపల్లి - టెలిఫోన్ కాలనీ లింక్ రోడ్డు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కొద్దిపాటి వర్షం కురిస్తే చాలు టెలిఫోన్ కాలనీ, రాంనగర్ కాలనీ, జానకారపల్లిలోని రోడ్లన్నీ మురుగు నీటితో బురదమయంగా మారుతున్నాయి. దీంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఈ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ లోపం కారణంగా మురుగు కాలువలన్నీ మట్టితో నిండిపోయాయి. మరో వైపు కనీసం రోడ్లలోని చెత్తను సైతం సేకరించడంలో మున్సిపల్ సిబ్బంది తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం పరిపాటిగా మారిపోయింది. మున్సిపల్ అధికారులు ఇకనైనా ఈ ప్రాంతాలపై దృష్టి సారించి పారిశుధ్య నిర్వహణను మెరుగుపర్చడంతో పాటు మట్టి రోడ్లను సిమెంట్ రోడ్లుగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

రోజంతా ముసురువాన



చిత్తూరులో వాన కష్టాలు - వెదురుకుప్పం మండలం యనమలమంద సమీపంలో రోడ్డుపై వాగు ప్రవాహం

● బయటకురాని ప్రజలు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావం కారణంగా బుధవారం నగరంలో ముసురుతో తేలికపాటి చిరుజల్లులతో కూడిన వర్షం పడింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఆకాశం మబ్బులతో కనిపించింది. విడతలు విడతలుగా తేలికపాటి వర్షం పడటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రాలేకపోయారు. వర్ష ప్రభావం కారణంగా ముందుగానే పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో విద్యార్థుల తాకిడి కనిపించలేదు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులతో పాటు కార్మికులు యథావిధిగా విధులకు హాజరయ్యారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా నీవానదితో పాటు మిట్ట ప్రాంతాల్లోని వర్షపు నీరంతా సంతపేటరోడ్డుపై ప్రవహించింది. దాంతో నగరపాలక అధికారులు అరగొండ-సంతపేట రోడ్డులో అండర్‌పైపులైన్‌ను ఏర్పాటు చేశారు. ముసురువాన కారణంగా నగరంలోని రోడ్ల పక్కనే పెట్టుకున్న కూరగాయలు, అరటిపండ్లు, ఇతర వస్తువులకు వ్యాపారాల్లేక చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. చలితీవ్రత ఎక్కువ కావడంతో జనం బయటికి రాలేకపోయారు.

రోడ్లపై ప్రవహించిన వాగులు.. రాకపోకలకు అంతరాయం

వెదురుకుప్పం: వర్షంతో వెదురుకుప్పం మండలంలో ఉన్న 178 చెరువుల్లో వందకు పైగా కలుజులు ప్రవహిస్తున్నాయి. మిగతా చెరువులు కూడా జలకళ సంతరించుకున్నాయి. యనమలమంద సమీపంలోని గుంటకు గండిపడటంతో నీరంతా వృథాగా లోతట్టు ప్రాంతానికి పోయింది. వెదురుకుప్పం-పెనుమూరు రహదారిలోని గుండుపల్లె, పాతగుంట సమీపంలో మొట్టిరెడ్డికండ్రిగ వద్ద వాగులు రోడ్లపైనే ప్రవహించాయి. వెదురుకుప్పం-దేవళంపేట రహదారిలో తంగేళిమిట్ట సమీపంలో రోడ్డుపై మద్యల వంక ఉధృతంగా ప్రవహించింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇక్కడ ఓ బైక్‌రైడర్ దాటడానికి ప్రయత్నించడంతో కొట్టుకునిపోతుండగా స్థానికులు చొరవ చూపి కాపాడారు. అలాగే ఆటో వారిని కూడా కాపాడి గట్టుకు చేర్చారు. ఆళ్లమడుగు, యనమలమంద ప్రాంతాల వద్ద కూడా రోడ్లపైనే వాగులు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రజలు ఇబ్బంది పడ్డారు. అక్కడక్కడా లోతట్టుగా ఉన్న ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. వెదురుకుప్పం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య, తహసీల్దార్ బాబు వాగులను సందర్శించారు. చెరువులు, వాగుల వైపు ప్రజలు వెళ్లరాదని ప్రజలను అప్రమత్తం చేశారు. ఇరిగేషన్ ఏఈ ప్రదీప్ చెరువులను పరిశీలించారు.

పంట పొలాలు జలమయం

విజయపురం: మండలంలో కురుస్తున్న వర్షాలకు పంట పొలాలు జలమయమయ్యాయి. బుధవారం ఉదయం 10 గంటల నుండి వర్షము తగ్గుముఖం పట్టడంతో వరద ఉధ్రుతి కొంత వరకు తగ్గింది. మండలంలో మొత్తం 40 చెరువుల్లో సుమారు 35 చెరువులు నిండు కుండలా మారియి. 20 చెరువులకు పైగా నిండి మొరవ పారుతున్నాయి. పన్నూరులో పూల తోటల్లో వర్షపునీరు చేరింది. కృష్ణసముద్రంలో వర్షపునీరు చేరడంతో వరి పంట నీట మునిగింది. కోసలనగరం, మహారాజపురం, ఇళ్ళత్తూరు, శ్రీహరిపురంలో ఇరిగేషన్ డీఈ వరప్రసాద్‌రెడ్డి, ఏఈ ప్రశాంత్ చెరువు కట్టలను, తూములను పరిశీలించారు. జంబాడలో తహసీల్దార్ కిరణ్ లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో కోసలనగరం సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్, చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, టీడీపీ నాయకుడు లోకేష్‌రాజు పాల్గొన్నారు.

పొంగి పొర్లుతున్న గార్గేయనది

ఐరాల: మండలంలో మంగళవారం రాత్రి కుండపోతగా వర్షం కురిసింది. ఉదయం నుంచి పూర్తిగా తెరలుతెరలుగా వర్షం కురిసి రాత్రి దంచి కొట్టింది. ఐరాలకు సమీపంలోని బీరప్పచెరువు దగ్గర్లోని అటవీ ప్రాంతంలో ఎక్కువ శాతం వర్షం కురవడంతో గార్గేయ నది పరవళ్లు తొక్కింది. రాత్రి గార్గేయనది తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉధ్రుతంగా ప్రవహించి ఉదయం మోస్తరుగా సాగింది. బుధవారం ఉదయం మూడు గంటల పాటు నదిపై వాహనాలు అటుఇటు ప్రయాణించలేకపోయాయి. వర్షం అధికంగా పడటంతో చిన్నచిన్న కుంటలు నిండిపోయాయి. వంక సాగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బోర్లు, బావుల్లో నీటి మట్టం పెరిగినట్లు రైతులు తెలిపారు.

నిండిన చెరువులు, నేల వాలిన వరి

పాలసముద్రం: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. వాగులు, వంకలు ప్రవహించి చెరువులు, కుంటలు నిండి కలుజులు పారుతున్నాయి. వనదుర్గాపురం, టీవీఎన్‌ఆర్.పురం గ్రామాల్లో వరి పైరు నేలకొరిగి పంట దెబ్బ తింటోందని రైతులు వాపోతున్నారు. వర్షానికి ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు.

స్కూళ్లలోకి చేరిన నీరు

గుడిపాల: మండలంలో కురుస్తున్న వర్షాలకు స్కూళ్లలోనికి వర్షపు నీరు చేరుతుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దక్షిణ బ్రాహ్మణపల్లె(డీబీ పల్లె), కోటూరు ప్రాథమిక పాఠశాలల్లోకి భారీ వర్షాలకు కురిసిన నీరు ఏటు పోలేక తన్నుకుంటుంది. మండలంలో వరి పంట కోతకు వచ్చే దశలో చిత్తపార, దళవాయిపల్లె, గొల్లమడుగు, ఏఎల్.పురం, చుక్కావారిపల్లె తదితర ప్రాంతాల్లో నేలపాలు కావడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

● పూతలపట్టు: పూతలపట్టులో కురుస్తున్న వానలకు వాగులు, వంకలు నిండడంతో పాటు గ్రామీణ ప్రాంతాలు కూడా తడిసి ముద్దయ్యాయి. వర్షపునీటితో వీధులన్నీ జలమయమయ్యాయి. పూతలపట్టు సమీపాన గల భీమానది, నీవానదితో పాటు పలు చెరువులకు నిండుగా నీరు చేరాయి. కమ్మగుట్టపల్లి పంచాయతీ పేటపల్లి వద్ద పూతలపట్టు నుండి ఐరాల మండలానికి వెళ్లే రోడ్డు జలమయమైందని స్థానిక ఎంపీటీసీ విజయలక్ష్మి మండల టీడీపీ అధ్యక్షుడు దొరబాబు చౌదరికి సమాచారం ఇవ్వడంతో స్పందించిన ఆయన, మాజీ కన్వీనర్ చంద్రమౌళి, మాజీ సర్పంచ్ కార్తికేయ చౌదరి, నేతాజీల సహకారంతో జేసీబీ ద్వారా మురుగునీటిని తొలగించారు.

పారుతున్న మొరవలు

పెనుమూరు: మండలంలో పలు చోట్ల చెరువులు నిండి మొరవ పారుతుంది. కొన్ని ప్రాంతాలకు రహదారులు తెగి నీరు పారుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎన్టీఆర్ జలాశయానికి భారీగా నీరు చేరడంతో అధికారులు 5 గేట్ల ద్వారా 1500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. తూపల్లి నుంచి బండపల్లికి వెళ్లే రహదారి పూర్తిగా కొట్టుకుపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొండయ్యగారిఊరు వద్ద వంక పెద్ద ఎత్తున రోడ్డుపై ప్రవహిస్తుంది. కేసీపల్లిలో అన్నీ చెరువులు మొరవ పారుతున్నాయి.



పూతలపట్టు మండలం పేటపల్లి వద్ద రోడ్డుపై నిలిచిన మురుగు నీటి తొలగింపు



గంగాధరనెల్లూరు మండలం వేల్కూరు గ్రామం వద్ద ప్రవహిస్తున్న చిట్టేరువంక

వేల్కూరు వద్ద ప్రవహిస్తున్న చిట్టేరువంక

గంగాధరనెల్లూరు: వేల్కూరు గ్రామంవద్ద చిట్టేరు వంక ప్రవహిస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో మండలంలోని వేల్కూరు చెరువుతో పాటు చిత్తూరు రూరల్ మండల పరిధిలోని ఎగువమాసాపల్లె చెరువు నిండిపోయి మొరవసాగుతున్నాయి. ఈ రెండు చెరువుల నీరు వేల్కూరు చిట్టేరువంకలో మీదుగా సాగి గంగాధరనెల్లూరు నీవానదిలో వచ్చి కలుస్తున్నాయి. దీంతో ఈ వంక పక్కన ఏర్పాటుచేసిన తాత్కాలిక రోడ్డు ఎప్పుడు కొట్టుకుపోతుందోనని పంచాయతీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



వెదురుకుప్పం మండలం పాతగుంట సమీపంలో రోడ్డుపైనే వాగు ప్రవాహం - విజయపురం మండలం పాతార్కాడు వాగులో ప్రవహిస్తున్న వరదనీరు - ఐరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద పారుతున్న గార్గేయనది - గుడిపాల మండలం దక్షిణ బ్రాహ్మణపల్లెలో పాఠశాలలోకి చేరిన నీరు - పెనుమూరు మండలం తూపల్లి నుంచి బండపల్లి రోడ్డుపై పారుతున్న నీటి ప్రవాహం

గుడిసె కూలిపోయిన బాధితురాలిని ఆదుకుంటాం: ఎమ్మెల్యే



వర్షానికి కూలిన విజయమ్మ పూరి గుడిసె

శ్రీరంగరాజపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో ఎస్ఆర్‌పురం మండలం పెద్ద తయ్యూరు గ్రామంలోని విజయమ్మకు చెందిన పూరి గుడిసె బుధవారం కూలిపోయింది. ఆమెకున్న ఇద్దరు కుమారులు పుట్టుకతోనే వికలాంగులు. విజయమ్మ సోషియల్ మీడియా ద్వారా ఈ సమస్యను తెలియజేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే థామస్.. విజయమ్మ కుటుంబానికి ప్రభుత్వం ద్వారా 50వేల రూపాయల ఆర్థిక సహాయంతో పాటు, ఎన్టీఆర్ గృహ కల్పన కింద ఇల్లు మంజూరు చేస్తామని హామి ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యే థామస్‌కు విజయమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

దారి విషయమై ఘర్షణ

బంగారుపాళ్యం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దారి విషయమై ఘర్షణ పడిన సంఘటన మండలంలోని మొగిలిలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు... మొగిలికి చెందిన ఆర్.సుబ్రమణ్యం, అమరావతమ్మ దంపతులకు అదే గ్రామానికి చెందిన తులసమ్మ, గోపిలకు దారి విషయమై బుధవారం ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా సుబ్రమణ్యం ఎడమ కంటిపై గోపి కొట్టడంతో రక్తగాయమైంది. సుబ్రమణ్యం భార్య అమరావతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తులసమ్మ, గోపిలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తహసీల్దార్ అరుణకుమారి బదిలీ

పాలసముద్రం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పాలసముద్రం తహసీల్దార్ అరుణకుమారిని చిత్తూరు కలెక్టరేట్‌కు, చిత్తూరు కలెక్టరేట్‌లో పనిచేసే గురప్పను పాలసముద్రం తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్ అరుణకుమారి గత కొన్ని నెలలుగా వైసీపీ నాయకులకు అనుకూలంగా పనులు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తడంతో గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్ సూచనల మేరకు ఆమెను బదిలీ చేసినట్లు టీడీపీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

పెనుమూరు డిప్యూటీ ఎంపీడీవోగా ఢిల్లీబాబు

పెనుమూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు డిప్యూటీ ఎంపీడీవోగా ఢిల్లీబాబును నియమిస్తూ డీపీవో ఉత్వర్వులు జారీ చేశారు. కాణిపాకం గ్రామ పంచాయతీలో గ్రేడ్-1 సెక్రటరీగా పనిచేస్తున్న ఈయన్ను పదోన్నతిపై పెనుమూరు డిప్యూటీ ఎంపీడీవోగా నియమించారు. ఈ మేరకు ఆయన విధుల్లో చేరారు.

25న చిత్తూరు మండల మీట్

చిత్తూరు రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 25వ తేదిన చిత్తూరు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు చిత్తూరు ఎంపీపీ గీత ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని మండల స్థాయి అధికారులు, సభ్యులు తప్పక హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి



సామనత్తం వద్ద మురుగునీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తతతో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే మురళీమోహన్ కోరారు. బుధవారం ఆయన అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పూతలపట్టు సమీపాన గల భీమానది, సామనత్తం వంక, పంటపల్లి వంక, పోతినాయని చెరువు, ఆకనంబట్టు వంక ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులు, వాగులు, కుంటల వద్ద ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, రైతులు పొలాలకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే ప్రభుత్వాధికారులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం పూతలపట్టు మండల పరిస్థితిపై జిల్లా కలెక్టర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు దొరబాబు చౌదరి, జిల్లా అధికార ప్రతినిధి గంగారపు గోపి, మాజీ కన్వీనర్ ప్రతాపనేని చంద్రమౌళి, నాయకులు మునిక్రిష్ణమ నాయుడు, ప్రతాపనేని ఇందిర, సురేంద్ర నాయుడు, ఎంపీడీవో నాగరాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీసు అమర వీరులకు జోహార్లు



కార్వేటినగరం ర్యాలీలో సీఐ హనుమంతప్ప, ఎస్ఐలు

వెదురుకుప్పం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం పోలీసుస్టేషన్ నుంచి గాండ్లమిట్ట కూడలి వరకు కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐలు సుమన్, చిన్నరెడ్డప్ప, ట్రైనీ ఎస్ఐ రమేష్, పోలీసులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. పోలీసు అమరవీరులకు జోహార్లు పలికారు.

వర్షాలకు కూలిన ఇల్లు



వర్షానికి కూలిన ఇంటిని పరిశీలిస్తున్న సచివాలయ సిబ్బంది

నగరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడిపల్లిలో వరుస వర్షాలకు కె.కోకిల అనే మహిళకు చెందిన ఇల్లు కూలిపోయింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఎవరూ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కూలిన ఇంటి వివరాలను సచివాలయ సిబ్బంది సేకరించారు.

కలుషిత నీటితో విజృంభిస్తున్న జ్వరాలు



జ్వరంతో బాధపడుతున్న మల్లీశ్వరి, నాగరాజునాయుడు



కొండాపురం వద్ద రోడ్డు పక్కనే ఉన్న పేడ దిబ్బలు

గుడిపాల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన బోర్లు వర్షానికి నీట మునగడంతో తాగునీరు కలుషితమైంది. ఈ కలుషిత నీటిని తాగడంతో జ్వరాలు విజృంభిస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కొండాపురం, దళవాయిపల్లె తదితర గ్రామాల్లో ప్రజలు కలుషిత నీరు తాగారని తెలిపారు. జ్వరాలున్న గ్రామాల్లో మెడికల్ క్యాంపు నిర్వహించాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా గ్రామాల సమీపంలో పేడ దిబ్బలు ఉండటంతో దోమల బెడద ఎక్కువగా ఉందని గ్రామస్తులు తెలిపారు.

గుంతలరోడ్డుపై ఇరుక్కుపోయిన కారు



కత్తార్లపల్లె క్రాస్ వద్ద రోడ్డుపై గోతిలో ఇరుక్కుపోయిన కారు

పుంగనూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు సమీపంలోని కత్తార్లపల్లె క్రాస్ వద్ద రోడ్డుపై చాలా కాలంగా ఏర్పడిన పెద్దపెద్ద గుంతల్లో బుధవారం ఓ కారు ఇరుక్కుపోయింది. పుంగనూరు నుంచి బెంగళూరుకు వెళుతున్న కారు గుంతలో దిగి వెనుకకు, ముందుకు రాకుండా ఆగింది. వర్షం కారణంగా రోడ్డుపై ఉన్న గుంత కనిపించకపోవడంతో కారు ఇరుక్కుంది. పుంగనూరు నుంచి సింగిరిగుంట, అరవపల్లె, కత్తార్లపల్లె క్రాస్ రోడ్డు వరకు అడుగడుగునా రోడ్డు దుస్థితికి చేరింది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని పుంగనూరు-బెంగళూరు రోడ్డు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

పుంగనూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మ హత్యకు పాల్పడిన సంఘటన పుంగనూరు మండలం సింగిరిగుంట పంచాయతీ మార్లపల్లెలో బుధవారం జరిగింది. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు.. సింగిరిగుంటకు చెందిన వెంకటరమణ కుమారుడు మునిరత్నం(52) వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ కలహాలతో మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి బుధవారం సాయంత్రం గ్రామ సమీపంలోని ఎర్ర చెరువు మొరవ వద్ద చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటరమణ సంఘటనా స్థలానికి చేరుకుని మునిరత్నం మృతికి గల కారణాలపై విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.